www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 26 నవంబర్ 2024
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



తప్పుడు ఆరోపణలపై కేసులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

తనపై లేనిపోని ఆరోపణలు చేసిన వారిపై సివిల్ క్రిమినల్ కేసులు పెడతామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కొంతమంది స్వార్థ రాజకీయ నాయకులు కావాలని ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. దీనిలో భాగంగానే రామచంద్రపురంలోని భూ సమస్యల్లో కావాలని తన పేరు వాడుతున్నారని ఆయన వివరించారు. తన మీద ఆరోపణలు చేస్తే వాళ్ల భూసమస్యలు తొందరగా తీరుతాయని మంత్రిపై ఆరోపణలు చేయండి వెంటనే మీ సమస్య పరిష్కారం అవుతుందని తప్పుడు సలహాలు ఇస్తున్నారన్నారు. ఆ ల్యాండ్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు. గతంలో వైసిపి నాయకులు పిల్లి సూర్య ప్రకాష్ కూడా తనపై నిరాధార ఆరోపణలు చేశారని, వారికి లీగల్ నోటీసులు ఇచ్చామని తెలిపారు.

ఏరులై పారుతున్న మద్యం

- చాటుమాటుగా బెల్టుషాపులు
- గ్రామాల్లో విచ్చలవిడిగా అమ్మకాలు
- చూసీ చూడనట్టు ఎక్సైజ్ అధికారులు తీరు

ప్రజాశక్తి - రాజోలు

రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీ మొదలైంది. జిల్లాలోని 169 మద్యం దుకాణాలను లాటరీ పద్ధతి ద్వారా ప్రభుత్వం కేటాయించింది. మద్యం దుకాణం కోసం దరఖాస్తు చేసేందుకే ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షలు వెచ్చించాల్సి వచ్చింది. పది, పదిహేను షాపులకు దరఖాస్తు చేసిన వారు కోట్లలో దరఖాస్తులకు కోసం ఖర్చు చేశారు. షాపు దక్కించుకున్నాక ఏడాదికి అర్బన్ పరిధిలో రూ.65 లక్షలు, రూరల్ పరిధిలో రూ.55 లక్షలు విడతలవారీగా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తం ఖర్చు చేసి ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం దుకాణం నడిపితే గిట్టుబాటు ఎలా అవుతుందని అనుకున్నారేమో వక్రమార్గాలు తొక్కుతున్నారు. పట్టణాలు, పల్లెలు అని తేడా లేకుండా బెల్టుషాపులు ఏర్పాటు చేసి అధిక



రేట్లకు మద్యం అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. గత నెల 16 తేదీ నుంచి నూతన మద్యం పాలసీ మేరకు మద్యం దుకాణాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. నాటి నుంచి సంపాదనే ధ్యేయంగా బెల్టుషాపులు ఏర్పాటుకు మద్యం దుకాణాల యజమానులు పావులు కదుపుతున్నారు. ఇలా జిల్లాలోని అనేక మండలాల్లో బెల్టుషాపులు ఏర్పాటయ్యాయి. మద్యం దుకాణాలు లేని ప్రాంతాల్లో చిన్న చిన్న కిరాణా షాపులు, హోటల్స్ ఇందు కోసం ఎంపిక చేసుకొని రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు అడ్వాన్స్ రూపంలో తీసుకొని మద్యంషాపు యజమానులు మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇలా బెల్టుషాపులు ఏర్పాటు చేసుకున్న వారు ఎంఆర్‌పి ధర కంటే రూ.30 నుంచి 40లు అదనంగా అమ్ముతున్నారు.

ఇష్టారాజ్యంగా..!

మద్యం దుకాణాలు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నడుపుకోవచ్చు అన్నది నిబంధన. లక్షలు వెచ్చించిన మద్యం దుకాణాదారులు ఉదయం 9 గంటలకే తెరిచి రాత్రి 11 గంటల వరకు విక్రయాలు జరుపుతున్నా అడిగే నాథుడే కరువయ్యారు. గుడి, బడి అని తేడా లేకుండా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల మందు చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు వెళ్ళేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మలికిపురం మండలం లక్కవరంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం బస్ స్టాప్ సమీపంలోనే ఉంది.రాజోలు మండలం తాటిపాకలో ఏర్పాటు చేసిన మద్యం షాపుదీ ఇదే పరిస్థితి. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో జనసంచారం ఎక్కువ ఉన్న రోడ్ల పక్కనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో మందుబాబులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మద్యం షాపులకు అనుమతు మంజూరు చేసిన ఎక్సైజ్ శాఖ అధికారులు సైతం చూసీ చూడన్నట్టు వ్యవహరిస్తుంటంతో మద్యం విక్రయాలు విచ్చిలవిడిగా నిబంధనలకు విర్ధుంగా సాగుతున్నాయని ఆరోపణలను వెల్లువెత్తున్నాయి.

ఏరియాలు పంచుకుంటూ...!

బెల్టు దుకాణాల కోసం మద్యం దుకాణాలు వారు ఏరియాలను దక్కించుకున్న పంచేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో బెల్టుషాపు నాది.. నేనే మద్యం సరఫరా చేస్తా అంటూ అక్రమ మార్గాల్లో మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు బెల్టుషాపులు ఏర్పాటుపై ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదనే విషయాన్ని మరచి మరీ దందా కొనసాగిస్తున్నారు. బెల్టుషాపులు సాఫీగా కొనసాగేలా స్థానిక రాజకీయ నాయకులతో బేరసారాలాడుతున్నారు. ఇలా అధికారుల అండదండలతో పట్టణాలు, పల్లెల్లో నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులను నడిపేస్తున్నారు.

అక్రమంగా సిట్టింగ్‌లు ఏర్పాటు...!

బెల్టు షాపుల్లో సిట్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నా పట్టించుకోవడంలేదు. ఆహార పదార్థాలు తయారు చేస్తూ మందుబాబులకు అందజేస్తున్నారు. బెల్టు షాపుల మధ్య పోటీ పెరగడంతో కస్టమర్లను ఆకర్షించేందుకు ఇక్కడోలే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరిగా బెల్టు షాపుల్లో చికెన్, మటన్, గుడ్లు, ఆమ్లేట్, తదితర ఆహార పదార్థాలను వండి అందజేస్తున్నారు.



మద్య పానాన్ని నిషేధించాలి

గత ప్రభుత్వాలు మద్యపానాన్ని పెంచి పోషించాయి. సామాన్యుల ప్రాణాలను బలిగొంటున్న మద్యాన్ని ప్రభుత్వం ప్రధాన ఆదాయ వనరుగా భావించడం సరికాదు. మద్యం నిషేధాన్ని క్రమంగా అమలు చేస్తామని గతంలో పాలకులు ప్రకటనలు ఇచ్చినా అమలు కాలేదు. తాగి ఇల్లూ ఒల్లూ గుల్ల చేసుకోవడమే కాక కుటుంబంలో భార్యాబిడ్డల హింసకు, అత్యాచారాలకు కారణమవుతున్న మద్యాన్ని అరికట్టాల్సిన, నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి. కూటమి ప్రభుత్వం మద్యాన్ని నియంత్రించి నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయాలి.

- కారెం వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కన్వీనర్,

సమస్యలు పరిష్కరించాలని శానిటేషన్ వర్కర్స్ ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న శానిటేషన్ వర్కర్స్

రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం మున్సిపల్ వర్కర్లు ధర్నా చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, కోశాధికారి కె.కృష్ణవేణి, ఉపాధ్యక్షులు ఎం.భాస్కర్‌రావు, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు విజయ, కుసుమ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో స్కూలు కళాశాల శానిటేషన్ వర్కర్స్‌కు, వాచ్‌మెన్‌లకు 6 నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడం ప్రభుత్వం సిగ్గు పడాలన్నారు. చిరుద్యోగులైన వారికి వచ్చే జీతం రూ.6000 అయితే ఇప్పటి వరకు పెండింగ్ ఉండటం వల్ల వాళ్ల కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా 5వ తేదీ లోపు వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, శానిటేషన్ పరికరాలు సరఫరా చేయాలని, శానిటేషన్ కార్మికులను, వాచ్‌మెన్‌లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని, సిక్ లీవులు ఇవ్వాలని, మట్టి ఖర్చులు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యవతి, సుశీల, దుర్గ భవాని, గంగా భవాని, సుజాత, మహాలక్ష్మి, సీత, దుర్గ, సత్యనారాయణ, జయరాజు, వెంకటలక్ష్మి, శానిటేషన్ వర్కర్స్, వాచ్‌మ్యాన్‌లు పాల్గొన్నారు.

రాజ్యాంగమే భారత దేశానికి దిక్సూచి

ప్రజాశక్తి -మలికిపురం



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరాజు

భారత దేశానికి దిక్సూచి రాజ్యాంగమే కానీ, సనాతనధర్మం కాదని హేతువాద సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు పెన్మత్స సుబ్బరాజు అన్నారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం అంబేద్కర్ భవన్‌లో బహుజన సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూషి జాన్ మోషే అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సనాతన ధర్మమా? రాజ్యాంగమా? అనే అంశంపై నిర్వహించిన సదస్సులో సుబ్బరాజు మాట్లాడారు. ధర్మం అంటే మత ధర్మమే తప్ప మానవ దర్మం కాదని,సనాతన దర్మం అంటే వేదాలే తప్ప మనుధర్మం కాదని కొంతమంది చేస్తున్న వాదనలో వాస్తవం లేదన్నారు. వేదాల బాస్యాన్నే స్మతులు చెబుతున్నాయని అయన అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి సనాతన దర్మం వ్యతిరేకం అని, ప్రతి పౌరుడూ శాస్త్రీయ దక్పథం అలవర్చుకోవాలని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయినప్పటికీ రాజ్యాంగంపై అవగాహన కొరవడిందని, రాజ్యాంగ పదవులలో ఉన్నవారికి సైతం అవగాహన లేకపోవడం దురదృష్టం అన్నారు. నేటికీ వివక్ష కొనసాగుతోందని తెలిపారు. రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల లక్ష్మణరావు, ముత్యాల శ్రీనివాసరావు, ఆకుమర్తి భూషణం, నల్లి ప్రసాద్, జనిపల్లి నాని, మోకా శ్రీనుబాబు, పట్నాల సత్యన్నారాయణ పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి ప్రచారం

ప్రజాశక్తి - రౌతులపూడి

ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తి సోమవారం మండలంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. గత 25 సంవత్సరాలుగా ఉపాధ్యాయులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిపిఎస్ రద్దు కోసం శ్రీకాకుళం నుంచి విజయవాడ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించానని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం జరిగే పోరాటాల్లో తాను ముందుంటానని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం పిడిఎఫ్‌తోనే సాధ్యమని అన్నారు. కాలేజీలో కాంట్రాక్టర్ లెక్చరర్ సంబంధించి క్రమబద్ధీకరణ జీవో నెంబర్ 114ను అమలు చేయాలని, అంతేకాకుండా ఎయిడెడ్ కళాశాలలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించడం మరియు బడ్జెట్లో నిధులు కేటాయింపు, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలోనూ పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టడం వంటి సమస్యలపై శాసనమండలిలో పోరాటం చేస్తానని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం జరిగే పోరాటాల్లో అగ్రభాగాన ఉంటానని అన్నారు. ఈ పర్యటనలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు కేరుప్రోలు హరిబాబు, నాయకులు నాగరాజు పాల్గొన్నారు.



ఎ.మల్లవరం పాఠశాలలో ఓటర్లను అభ్యర్థిస్తున్న గోపిమూర్తి



అజీజ్‌కు అభినందనలు తెలియజేస్తున్న షరీఫ్

వక్ఫ్ బోర్డు చైర్మన్‌కు అభినందన

ప్రజాశక్తి-కొత్తపేట

ఎపి వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన షేక్ అబ్దుల్ అజీజ్‌ను సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ మీరాన్ షరీఫ్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆయన మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

పలువురికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రాజోలు

సోంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ వైద్య శిబిరం నిర్వహించారు. మామిడికుదురు అంజు కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ తేజ ఆధ్వర్యంలో 54 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 16 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. 29 మందికి రాయితీపై కళ్ల జోళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో రాజోలు వైస్ ఎంపిపి పొలమూరి శ్యామ్‌బాబు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, అంజు ఆసుపత్రి మేనేజర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.


అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి-అమలాపురం

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్ర మం ద్వారా అందే ప్రతి అర్జీపైనా ప్రత్యేక కృష్టి పెట్టి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డిఆర్ఒ, మదన్ మోహన్ రావు, డిఆర్‌డిఎ పీడీ శివశంకర్ ప్రసాద్, డ్వామా పీడి మధుసూదన్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏ రోజు కారోజే తమ లాగిన్‌కు వచ్చిన అర్జీలను ఓపెన్ చేయాలని, సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాస్థాయిలోనే కాక మండల, మున్సిపల్, డివిజనల్ స్థాయిలోనూ అర్జీల స్వీకరణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసినందున ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డివిజన్, మండల స్థాయిల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, అన్ని శాఖల అధికారులు హాజరవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అందజేసిన అర్జీల గురించి సంబంధిత జిల్లా, మండల స్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేయాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా సత్వర పరిష్కారం చూపాలని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో పరిష్కారం చేయాల్సిన సమస్యల గురించి కూడా ప్రజలు జిల్లా కార్యాలయానికి వస్తున్నారని, అందువల్ల ప్రజలకు డబ్బు, సమయం వృథా అవుతున్నాయన్నారు. మండల కార్యాలయంలో అందజేసిన ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యలను సమీక్షిస్తామని కలెక్టరు తెలిపారు. మండల, మున్సిపాలిటీ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను మాత్రమే జిల్లా స్థాయి పిజిఆర్ఎస్‌లో సమర్పించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అందుకుగాను వచ్చిన ప్రతి అర్జీనీ అవగాహన చేసుకోవడం, అర్జీదారుని వద్దకు వెళ్లి సమస్య గురించి మాట్లాడడం, సమస్య సంబంధిత శాఖ పరిధిలోనిది కాకపోతే తెలియజేయడం, అందుకు గల కారణాలను వివరించడం, తదుపరి కార్యాచరణపై అర్జీదారునికి అవగాహన కల్పించడం వంటి అంశాలపై అవగాహన పెంపొందించాలని అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్



భీమేశ్వరాలయంలో విద్యుత్ దీపాల అలంకరణ

కార్తీక దీపారాధనకు ముస్తాబైన ద్రాక్షారామ

ప్రజాశక్తి-రామచంద్రపురం

రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రసన్నాంజనేయ స్వామి బాల భక్త సమాజం ఆధ్వర్యంలో జరిగే 61వ కార్తీక దీపారాధన మహోత్సవానికి ద్రాక్షారామ ముస్తాబయింది. ప్రసిద్ధిగాంచిన విద్యుత్ దీపాలంకరణ లైటింగ్‌లను సుమారు 20 సంస్థలు ఏర్పాటు చేశాయి. హైదరాబాదు నుండి సినీ నటులు, టీవీ నటులు, సినీ గాయకులు ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు. పౌరాణిక నాటకాలను ఏర్పాటు చేశారు. వీటితోపాటు భారీ ఎత్తున బాణాసంచా కాల్చడం ఇక్కడ ఆనమయితీ. జిల్లా నలుమూలల నుంచి లక్షలాది మంది ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లను పూర్తి చేశారు.

ఇసుక మాఫియా ఆగడాలు

ప్రజాశక్తి-అయినవిల్లి

కొండుకుదురు గ్రామంలో గోదావరి నది చెంతన ఇసుక మాఫియా ఆగడాలు పెరిగిపోతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకపోయినా సిఆర్ జడ్ నిబంధనలను, పర్యావరణ నిబంధనలను తుంగలోకి తొక్కి రాత్రనక, పగలనక ఇసుకను తరలించేస్తున్నారు. ఇదేమని అడుగుతుంటే సొంత అవసరాల కోసం అని చెప్పి ట్రాక్టర్ ఇసుక రూ.5 వేలు, రూ.6 వేలకు అమ్మకాలు సాగిస్తున్నారని స్థానికులు తెలిపారు. సోమవారం ఇదేవిధంగా నదీ గర్భం నుంచి ఇసుక తీసి ట్రాక్టర్‌పై తరలిస్తుంటే స్థానిక ఎంపిటిసి భర్త, స్థానిక నాయకుడు గుర్రాల రాంబాబు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకొన్న విఆర్ఒ ట్రాక్టర్‌ను ఆపాలని కోరడంతో కొంతమంది ఆయనపై తిరగబడి పక్కు నెట్టి ట్రాక్టర్‌ను తీసుకుపోయారు. దీంతో విఆర్ఒ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవలే అక్రమ ఇసుక తరలింపుపై సిఐ భీమరాజు దాడులు చేసి పది ట్రాక్టర్లను సీజ్ చేసినా అక్రమ రవాణా ఆగడం లేదని స్థానికులు తెలిపారు.



ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న ఇసుక

ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల్లో పాల్గొనాలి

ప్రజాశక్తి -అల్లవరం

ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల్లో సచివాలయ సిబ్బంది అందరూ పాల్గొనాలని ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలైన బ్యాంక్ ఖాతా ఎన్‌పిసిఐ లింకింగ్, హౌస్ హోల్డ్ ఇమేజ్ క్యాప్చర్ సర్వే, క్లస్టర్ మ్యాపింగ్ వంటి వాటిలో సచివాలయ ఉద్యోగులు అందరూ విధిగా పాల్గొనాలన్నారు. ఈ నెల 30వ తేదీ నాటికి అన్ని అంశాల్లో నూరు శాతం లక్ష్యాలు సాధించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సచివాలయం సిబ్బంది రవి రాజు, సుభాషిణి, దిలీప్, షమ్మి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 9లోగా ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

అర్హులైన గ్రాడ్యుయేట్‌లు డిసెంబర్ 9 లోగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహశీల్దారు జె.వెంకటేశ్వరి తెలిపారు. గ్రాడ్యుయేట్లు అందరూ రెవెన్యూ లేదా ఎంపిడిఒ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంఎల్‌ఎసి ఓటర్ల డ్రాఫ్ రోల్ జాబితా ప్రచురించామని, అవసరమైన సవరణలు ఉంటే తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు.



మహిళల హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-అమలాపురం

మహిళల హక్కులపై అవగాహన ఎంతైనా అవసరమని డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ వి.శివ శంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో స్త్రీల హక్కుల పరిరక్షణ, స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జెండర్ హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారాన్ని ఈ నెల 25 నుంచి డిసెంబర్ 23 వరకు నూతన చైతన్యంతో నిర్వహించాలన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా నవంబరు 25న స్త్రీల హక్కుల పరిరక్షణ స్త్రీ హింసా వ్యతిరేక దినంగా పాటించాలని తీర్మానించిందన్నారు. ఆ మేరకు నాలుగు వారాలు పాటు జెండర్ ఆధారిత హింసకు తావు లేకుండా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మహిళా వివక్షతో భ్రూణ హత్యల నిరోధంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆధునిక సమాజంలో గృహ హింసలు, స్త్రీలపై అత్యాచారాలు లైంగిక వేధింపుల నిరోధానికి చేపట్టాల్సిన చర్యలు ఆత్మనూన్యతా భావానికి లోనై స్త్రీలు ఆత్మహత్యలకు పాల్పడకుండా ధైర్యాన్ని నింపడం వంటి చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళలకు రాజ్యాంగం ఎన్నో హక్కులు కల్పించినా వాటిపై సరైన అవగాహన లేకపోవడం, కనీసం వాటి గురించి తెలియక పోవడంతో మహిళలు మరింత అన్యాయాలకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వాలు తెస్తున్న చట్టాలపై అవగాహన కల్పించుకుని సమాజంలో ఉన్నతంగా జీవనాన్ని గడపాలన్నారు గర్భంలో ఉన్న బిడ్డ ఆడ శిశువు అని తెలియగానే ముందే భ్రూణ హత్యలు, పుట్టిన తర్వాత వివక్షలు, మహిళల జీవితాలను నరక ప్రాయం కాకుండా అరికట్టే అంశాలపై అవగాహన సమాజంలో కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్ మోహనరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఎం.ఝాన్సీ రాణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి పి.జ్యోతిలక్ష్మి దేవి, మెప్మా పీడీ ప్రియంవద, జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఎస్.మధు సూదన్, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ అధికారులు పాల్గొన్నారు.



స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - ఆలమూరు

తమిళనాడులో న్యాయవాది హత్య, విశాఖపట్నంలో న్యాయ విద్యార్థినిపై లైంగిక దాడికి నిరసనగా స్థానిక న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించారు. ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణం వద్ద ఉన్న బార్ అసోసియేషన్‌లో అధ్యక్షుడు జొన్నపల్లి సత్యనారాయణ స్థానిక విలేకరులతో మాట్లాడారు. న్యాయవాదుల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడిన వ్యక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వేమగిరి నరసింహమూర్తి, సెక్రటరీ చల్లా సతీష్, ట్రెజరర్ విద్యా ప్రసన్న, జి.రాజశేఖర్, సలాది సత్యనారాయణమూర్తి, కప్పల సునీల్ కుమార్, ఆదిమూలం అబ్బులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - మలికిపురం

మలికిపురంలో ఒక బాలుడిపై మరో నలుగురు మైనర్లు విచక్షణా రహితంగా చేసిన దాడిలో నిష్పక్షపాత దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని బిఎస్‌పి రాజోలు నియోజకవర్గ అధ్యక్షులు ఆకుమర్తి భూషణం అన్నారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి బాధితుని పరామర్శించారు. విచ్చలవిడి మాదకద్రవ్యాల వినియోగాన్ని అదుపు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. ఈ కార్యక్రమంలో అప్పారి విజయరాజు, జనపల్లి నాని, మోకా శ్రీనుబాబు, పట్నాల సత్యనారాయణ, గుబ్బల బాబ్జి, కాంద్రేగుల నరసింహం, అనసూరి సతీష్ పాల్గొన్నారు. అనంతరం చెల్లుబోయిన శ్రీనివాస్, పితాని సురేంద్ర కూడా పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఉపాధ్యాయిని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి -సఖినేటిపల్లి

ఇటీవల మరణించిన అంతర్వేదిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయిన గేదెల సునీత కుటుంబ సభ్యులకు ఎస్‌టియు ఆధ్వర్యంలో సోమవారం రూ.2 లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.దొరబాబు, ప్రధాన కార్యదర్శ్ ఎస్.పల్లంరాజు మాట్లాడారు. ఎంఇఒలు డి.కిషోర్ కుమార్, ఎం.వెంకటేశ్వరరావు బాధిత కుటుంబాలకు అండగా ఉంటారని తెలిపారు. గుబ్బల శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి యు.గిరిబాబు, అభయ్ జిల్లా కన్వీనర్ ప్రసాద్, మండల కన్వీనర్ నాగబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.రాంబాబు, జిల్లా నాయకులు, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం డి.కృష్ణంరాజు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఎస్‌టియు నాయకులు

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని వేగాయమ్మపేటకు చెందిన గుత్తుల రమ్యశ్రీ (24) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన రమ్యశ్రీకి వేగాయమ్మపేటకు చెందిన గుత్తు రాజుతో వివాహం అయ్యింది. వారికి ఒక బాబు ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన మేడిశెట్టి దుర్గా వరప్రసాద్‌తో చనువుగా ఉంటూ ఇంటిలోని బంగారం అతడికి ఇచ్చివేసింది. విషయం తెలిసిన భర్త, తండ్రి నిలదీయంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. దీనిపై ఆమె తండ్రి అనసూరి గనిరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ద్రాక్షారామం ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తొండంగి

అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగిన ఒక వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలు ప్రకారం..మండలంలోని శృంగ వక్షం గ్రామానికి చెందిన బోయిన బాబూరావు(31) తన పొలంలో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని కుటుంబ సభ్యులు తునిలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం అతనిని కాకినాడ మరో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

163 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని సోమవరం గ్రామంలో 163 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్ తెలిపారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో సోమవరం గ్రామంలో తనిఖీలు నిర్వహించగా వైజాగ్ నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న గూడ్స్ వాహనాన్ని తనిఖీ చేయగా 163 కేజీల గంజాయిని గుర్తించినట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. విశాఖ ఏజెన్సీ నుంచి చెన్నైలోని గుమ్మిడిపొండి గ్రామానికి తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రత్తిపాడు కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 8 మందికి రూ.10 వేలు చొప్పున మెజిస్ట్రేట్ కోర్టు జరిమానా విధించినట్లు సిఐ సూర్య అప్పారావు తెలిపారు. ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలతోపాటు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

10 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని జె.కొత్తూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక వ్యక్తి నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో 8 మంది సారా ముద్దాయిలను గండేపల్లి తహశీల్దార్ కోర్టులో బైండోవర్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని రామేశంపేటలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్ వస్తున్న వారిని వ్యాన్ ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగపతినగరం గ్రామానికి చెందిన తాటిపాక గంగరాజు(28) భార్య, పిల్లలతో రంగంపేట గ్రామంలోని కోళ్ల ఫారంలో నివాసం ఉంటున్నాడు. మధ్యాహ్నం తన కుమారుడు అనిల్‌ను ఆనూరు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా రామేశ్వరంపేట వైపు వస్తున్న వ్యాన్ ఢీ కొట్టింది. ద్విచక్రవాహనంపై ఉన్న బాలుడు రోడ్డు పక్కకు పడిపోగా గంగరాజు తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. గంగరాజు భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ నాగబాబు తెలిపారు.



బోల్తా పడిన ఆటోను సరి చేస్తున్న స్థానికులు

ఆటో బోల్తా : తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలంలోని ఎర్ర పోతవరం, శివల మెయిన్ రోడ్డుపై సోమవారం ప్రయాణికులతో వెళుతున్న ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. మెయిన్ రోడ్డుపై రైతులు ధాన్యం ఆర బెట్టుకున్నారు. ధాన్యం రాశులు తప్పించుకుంటూ వెళ్లిన ఆటో ప్రయాణికులతో బోల్తా పడింది. చిన్న పిల్లలతో పాటు పదిమంది ప్రయాణికులు ఉన్న ఆటో బోల్తా పడిన వెంటనే అక్కడే ఉన్న వ్యవసాయ కూలీలు పరుగున వెళ్లి ప్రయాణికులను బయటకు తీసి ఆటోను తీశారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు మినహా ఎవరికీ ఏ విధమైన ప్రమాదం జరగలేదు. రైతులు పెద్ద ఎత్తున తొలకరి ధాన్యాన్ని మెయిన్ రోడ్లపై ఎండబెట్టడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనాలకు దారి విడిచిపెట్టి ధాన్యం ఎండ పెట్టుకోవాలని పలువురు కోరుతున్నారు.

ముగ్గురు సారా విక్రేతల అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలమూరు, మండపేట మండలాల్లో నాటు సారా విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ సిఐ డి.నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మడికి, బడుగువానిలంక, మండపేట మండలంలోని కేశవరం గ్రామాల్లో దాడులు నిర్వహించామన్నారు.

అపార్ ఐడి నమోదు విద్యార్థికి అత్యంత కీలకం

ప్రజాశక్తి-అమలాపురం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అపార్ ఐడి నమోదు విద్యార్థికి అత్యంత కీలకమని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి వివిధ మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉచిత ఇసుక పాలసీ, ధాన్యం సేకరణ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు, రీ సర్వే సరిహద్దు రాళ్లపై పేర్లు తొలగింపు వంటి అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలో అపార్ నమోదై నూటికి నూరు శాతం పూర్తి చేయాలన్నారు అపార్ ఐడిలు జనరేట్ చేసేందుకు అవసరమైన ఆధార్, జనన తేదీ, స్కూల్ సర్టిఫికేట్ల మధ్య వ్యత్యాసాలను సరిదిద్దాలన్నారు జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 83 శాతం పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండి యా, యుపిఐ ద్వారా కస్టమర్లకు క్రెడిట్ లైన్లను అందించడానికి బ్యాంకులను ఆర్‌బిఐ అనుమతించిందన్నారు. సచివాలయ సంక్షేమ సహాయకులు పోస్టల్ అధికారుల సమన్వయంతో ఖాతాకు ఆధార్ నెంబర్ లింక్ చేయించాలని సూచించారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథక ఫలాలను ఆధార్ ప్రామాణికంగా నేరుగా పొందే వెసులుబాటు కలుగుతుందన్నారు. ప్రక్రియలో మిగిలి ఉన్న 20 లింకేజ్ జనరేషన్ మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. సూక్ష్మ చిన్న మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ ఎంఎస్ఎం ఈ సర్వే ఈ నెల 29 నుంచి ప్రారంభించి జిల్లాలో ఉన్న 96 వేల యూనిట్ల సర్వేను డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. నీటి వినియోగదారుల సంఘాలు దశలవారీగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాటు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాల మరమ్మతుల అంచనాల నివేదికలను రానున్న మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో అందించాలని ఆదేశించారు. డిసెంబరు ఒకటో తేదీన ఆదివారం సెలవు దినం కావున ముందు రోజైన నవంబర్ 30న సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం మూడు నెలల వరకు పింఛన్ పొందే అవకాశాన్ని కల్పించిందని, పింఛన్‌దారు మరణిస్తే భాగస్వామికి వితంతు పింఛన్ కొనసాగించే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో తుపాను కారణంగా వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు ధాన్యం కోతలను నిలుపుదల చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాస్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి గాను సీనియర్ అసిస్టెంట్ స్థాయి నోడల్ అధికారిగా నియమించి అతని సెల్ నెంబరు డిఆర్‌ఒకు ఇవ్వాలని ఆదేశించారు. నరేగా అనుసంధానంతో పల్లె పండుగ కార్యక్రమంలో ప్రారంభించిన నిర్మాణ పనులు అయినా రోడ్లు పశువుల షెడ్లు వేగవంతం చేసి సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు సంబంధించి అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డిఆర్ఒ వి.మదన్‌మోహనరావు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లపై మాజీ సిఎం జగన్ ఫోటో

ప్రజాశక్తి-కాట్రేనికోన

ముఖ్యమంత్రిగా చంద్రబాబు పాలన నెలలు గడుస్తున్నా సచివాలయ సిబ్బందికి మాత్రం మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ ఫోటోలతోనే సర్టిఫికెట్లు జారీ చేస్తుండడంతో అయోమయం నెలకొంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందే ప్రభుత్వ కార్యాలయాలు, సర్టిఫికెట్లపై రాజకీయ నాయకులు ఫోటోలను ఎన్నికల కమిషన్ నిషేధించింది. వైసిపి పాలనలో మీసేవ, గ్రామ వార్డు సచివాలయాల్లో జారీ చేసే కులం, ఆదాయం, జనన ధ్రువీకరణ తదితర సర్టిఫికెట్లపై అప్పటి సిఎం జగన్ ఫోటోలు ఉండేవి. సర్టిఫికెట్లపై జగన్ ఫోటో వల్ల అనేక సమస్యలు ఎదురై విద్యార్థులు నిరుద్యోగులు ఇబ్బందులు పడేవారు. ఇది గమనించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సర్టిఫికెట్లపై ఫొటోలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మీ సేవ, సచివాలయాల్లో మిగిలి ఉన్న జగన్ ఫోటో ఉన్న సర్టిఫికెట్లను కూడా తిరిగి స్వాధీనం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే మిగిలి ఉన్న సర్టిఫికెట్లను సంబంధిత అధికారులకు ఇచ్చేశారు. జగన్ ఫోటో ఉన్న పాత సర్టిఫికెట్ ఉపయోగిస్తే సంబంధిత మీసేవ ఆపరేటర్, సచివాలయ సిబ్బందికి రూ.50,000 జరిమానాతోపాటు, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అధికారులు ఆదేశాల్లో పేర్కొన్నారు. అమలాపురం మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ ఏరియా వార్డు సచివాలయంలో ఇప్పటికీ జగన్ ఫోటో ఉన్న సర్టిఫికెట్లను జారీ చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ నెల 19న కాట్రేనికోన మండలం, నడవపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని మేరీ ఏంజెల్‌కు జగన్ ఫోటో ఉన్న పాత సర్టిఫికెట్‌పై జనన ధ్రువీకరణ పత్రాన్ని అక్కడి వార్డు ఎడ్యుకేషన్ కార్యదర్శి జారీ చేయడం గమనార్హం. సీరియల్ నెంబర్ ఎపిజిఎస్‌డబ్ల్యూఎస్‌ఎసి 49320764 సర్టిఫికెట్‌పై సిడిఎస్ఐ 012403035912 జనన ధ్రువీకరణ పత్రం ఇవ్వడంతో అది చెల్లుబాటు కాక ఆ విద్యార్థికి ఇక్కట్లు తప్పలేదు. మళ్లీ బయట మీ సేవా కేంద్రంలో కొత్తగా జనన సర్టిఫికెట్ తీసుకుని అపార్ కార్డు పని ముగించుకోవాల్సి వచ్చింది.

శివలలో లెప్రసీ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-కె.గంగవరం

మండలంలోని శివల ప్రాథమిక పాఠశాలలో సోమవారం లెప్రసీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. లెప్రసీ అధికారి మాధవరపు వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు ఒంటిపై తెల్ల మచ్చలు, దురదతో కూడిన మచ్చలు, తామర వంటి చర్మ వ్యాధులు ఉంటే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రం సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఇదే లక్షణాలు ఇంట్లో ఎవరికి ఉన్నా వారి వివరాలు కూడా ఆరోగ్య కేంద్రం సిబ్బందికి తెలపాలని ఆయన సూచించారు. లెప్రసీ వ్యాధిని ముందుగా గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చని ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, శివల ఎఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం



తుపాను హెచ్చరికల నేపథ్యంలో ముమ్మరంగా వరి కోతలు

తుపాను హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలను నాలుగైదు రోజులపాటు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బలుసు రవి తెలిపారు. అమరావతి వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో వాయుగుండం తుపానుగా మారే అవకాశం ఉందని, రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే 85 శాతం వరి కోతలు పూర్తయ్యాయని, ధాన్యం సిద్ధం చేసుకున్న రైతులు పల్లపు ప్రాంతాల నుంచి ఎత్తయిన ప్రదేశాల్లో ధాన్యం నిలువ చేసుకోవాలని, కళ్లాల్లో ఉన్న ధాన్యంపై బరకాలు కప్పుకోవాలని, ఒకవేళ ధాన్యం తడిస్తే ఉప్పు వరి నూక కలిపి నిలువ చేసుకోవాలని ఆయన తెలిపారు. చేలో ఉన్న వరి పనులకు ఉప్పునీటిని పిచికారీ చేసుకోవడం వల్ల ధాన్యం త్వరగా మొలకెత్తకుండా ఉంటుందని సూచించారు. వరి కుప్పలుగా వేసినట్లయితే వాటిపై బరకాల కప్పుకోవాలని సూచించారు.

బీచ్ వాలీబాల్ పోటీలకు మనోజ్ ఎంపిక

ప్రజాశక్తి - అంబాజీపేట

రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు పుల్లేటికుర్రు హైస్కూల్ విద్యార్థి మనోజ్ ఎంపికైనట్లు హెచ్ఎం. ఎ.సూర్యకనకదుర్గ తెలిపారు. ఈ నెల 23న కాకినాడ ఎన్‌టిఆర్ బీచ్‌లో స్కూల్ కిడ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో యూ/10 విభాగంలో బీచ్ వాలీబాల్ పోటీలలో కొప్పిశెట్టి మనోజ్ అత్యంత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 26, 27 తేదీలలో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటాడని పీడీ అందే సూర్యనారాయణ తెలిపారు. విద్యార్థిని సర్పంచి జల్లి బాలరాజు, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ ఎన్.రత్నమాల, కమిటీ సభ్యులు, ఉప సర్పంచ్ వీరా రవి, ఎంపిటిసి సభ్యులు పబ్బినీడి రాంబాబు, వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా న్యాయవాది షరీఫ్ పుట్టిన రోజు

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రముఖ న్యాయవాది షేక్ షరీఫ్ 55వ పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, న్యాయవాదులు, ఆయనకు శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, సర్పంచులు గుణ్ణం రాంబాబు, తమ్మన శ్రీనివాస్, మాజీ ఎంపిపి తోరాటి రాంబాబు, నేతలు నాతి కుమార్ రాజా, యనమదల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయంలో ఎంఎల్ఎ సత్యానందరావు పూజలు

కొత్తపేట : గొలకోటివారిపాలెంలో పంచముఖ ఆంజనేయస్వామి నాలుగో వార్షికోత్సంలో సోమవారం కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, ధరణాల రామకృష్ణ, రెడ్డి తాతాజీ, సరెళ్ల సరితారాజబాబు, చిలకలపూడి సుబ్రహ్మణ్యం, గొలకోటి యేసు, గోలకోటి సీతారామం పాల్గొన్నారు.

బాలాజీ నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళాలు

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానం శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు సోమవారం మామిడికుదురు వాసులు గుబ్బల శ్రీనివాస్ మంగాదేవి దంపతులు, ఆశశ్రీ రూ.10,116, అప్పనపల్లి వాసులు సింహాద్రి సత్యసాయి బాలసుబ్రమణ్యం కుటుంబ సభ్యులు రూ.10 వేల విరాళం ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. విరాళాల దాతలకు ఆలయ ఉద్యోగులు స్వామి చిత్రపటం, ప్రసాదం అందించారు.



దాతలకు చిత్రపటం అందిస్తున్న ఆలయ సిబ్బంది

మెప్మా ఆధ్వర్యాన ఎంఎల్ఎ దాట్లకు సత్కారం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

అసెంబ్లీ విప్‌గా నియమితులైన ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజును నగర పంచాయతి మెప్మా ఆధ్వర్యాన సోమవారం ఘనంగా సత్కరించారు. మురమళ్ల క్యాంప్ కార్యాలయంలో మెప్మా మహిళలు ఎంఎల్ఎ సుబ్బరాజును కలిసి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకుడు రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ మాట్లాడుతూ అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్న ఎంఎల్ఎ సుబ్బరాజు విప్‌గా ఎంపిక కావడం నియోజకవర్గానికి దక్కిన గౌరవమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పిల్లి నాగరాజు విళ్ల వీరాస్వామి నాయుడు, గొల్లపల్లి గోపి, నగర పంచాయతి కమిషనర్ రవి వర్మ, మేనేజర్ నూకరాజు, ఎఇ సుధాకర్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ భాస్కర్ పాల్గొన్నారు.

వన సమారాధనలో ఎంఎల్ఎ బండారు

ప్రజాశక్తి-రావులపాలెం

మండల పరిధిలోని పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకియమ్మ అన్నదాన సత్రం వన సమారాధనలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు సోమవారం పాల్గొన్నారు. ఆయన వన భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సత్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారం, నగదు బహుమతులు, పదవతరగతి విద్యార్థులకు పుస్తకాలు, వృద్ధులకు దుప్పట్లను ఎంఎల్ఎ అందజేశారు. వన సమారాధనలో వందలాది మందికి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్, వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గంధం అన్నవరం, గోపిశెట్టి సత్తిబాబు, అల్లూరి కృష్ణంరాజు, కుడుపూడి వెంకటేశ్వర్లు, వీటి రాజు, చిలకమర్తి శివ కృష్ణ, వీటి రాంబాబు, ఇఒ మీసాల రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-రావులపాలెం

స్థానిక అరటి మార్కెట్ యార్డులోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆర్‌డిఒ శ్రీకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం రావులపాలెంలో ఆర్‌డిఒ పర్యటించారు. ఆత్రేయపురం, కొత్తపేట, రావులపాలెం మండలాలకు పంపిణీ చేసే మార్కెట్ యార్డు గొడౌన్‌లోని బియ్యం, పప్పులు, వంట నూనె స్టాక్ పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ముక్తేశ్వరరావు, ఎంఎస్ఒ, ఆర్ఐ సుజాత, గొడౌన్ ఇన్‌ఛార్జి సిహెచ్.సతీష్, టెక్నికల్ అసిస్టెంట్ వై.నాని, అప్పలరాజు పాల్గొన్నారు.

దారి మధ్యలో స్తంభాలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి-అమలాపురం

రూరల్ మండలం బండారులంక పంచాయతీ కందులపాడు కాలనీలో ప్రధాన రోడ్డు మార్గంలో కొంత మంది అక్రమంగా పాతిన ఇనుప స్తంభాలు తొలగించాలని గ్రామస్తులు సోమవారం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావును కలిసి వినతి పత్రం అందించారు. అనారోగ్యానికి గురైన వారిని ఆసుపత్రి తీసుకువెళ్లడానికి కనీసం అంబులెన్స్ కాలనీలోకి రాకపోవడం వల్ల చేతులపై మోసుకుని వెళుతున్నట్టు వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరి వ్యక్తిగత వివాదం వల్ల మొత్తం కాలనీ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. అనేకసార్లు అధికారులకు మొర పెట్టుకున్నప్పటికి సిసి రోడ్డు మధ్యలో వేసిన ఇనుపు స్తంభాలు తొలగించలేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి అమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొలమూరి మోహన్ బాబు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, గ్రామస్తులు మంజుల, పద్మ, శోభ, వెంకటలక్ష్మి, రాణి సూర్య లక్ష్మి రుక్మిణి పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం రాత్రి ఒక తాటాకిల్లు దగ్ధమయ్యింది. ఠానేలంక గ్రామానికి చెందిన కొప్పిశెట్టి భూలక్ష్మికి చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి అగ్నికి ఆహుతి అయ్యింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని గృహోపకరణాలు వంట సామాగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో పాటు ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

అవార్డు గ్రహీతకు అభినందనలు

ప్రజాశక్తి-రావులపాలెం

ఈతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కెఎస్‌వి.కృష్ణారెడ్డికి రాష్ట్ర ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుని అవార్డు లభించింది. ఏపి సోషల్ టీచర్స్ ఫోరమ్ కృష్ణారెడ్డిని బెస్ట్ సోషల్ టీచర్‌గా ఎంపిక చేసి సత్కరించింది. సోమవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవార్డును విజయనగరం, ఎస్‌విఎన్ లేక్ ప్యాలెస్‌లో ఎంఎల్‌సి పాకలపాటి రఘువర్మ ద్వారా అందుకున్నారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం వీరిని ఫెలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో గౌరవించింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతను జెడ్‌పి పాఠశాల చైర్మన్ పిప్పర రమేష్, గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి సుబ్బలక్ష్మి, టిడిపి నాయకులు యర్రంశెట్టి నాగేశ్వరరావు, గంగ్రోతు వీరగోవిందరావు, వెలుగట్ల రామకృష్ణ అభినందించారు.

26న లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యాన సదస్సు

ప్రజాశక్తి-అమలాపురం

ఈ నెల 26న మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక నల్ల వంతెన వద్ద ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్యక్షులు వి.నరేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపి స్టేట్ లీగల్ అథారిటీ వారి సూచనల మేరకు తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ ప్రొసీడింగ్ ప్రకారం, అమలాపురంలోని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, ఈ నెల 26న న్యాయ అక్షరాస్యత శిబిరాన్ని నిర్వహించాలని ప్రతిపాదించిందన్నారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

పౌరుల జీవన విధానానికి మూలమైన రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బిఎస్ఐ) జిల్లా కోశాధికారి ఎస్.పధ్వీరాజ్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని డాక్టర్ మోకా గణపతి రావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం బుద్ధిస్ట్ ఆఫ్ ఇండియా (బిఎస్ఐ) జిల్లా శాఖ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు భారత రాజ్యాంగంపై పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు సుమారు 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురికి షీల్డులు బహూకరిస్తామని నిర్వా హకులు పేర్కొన్నారు. బిఎస్ఐ ఆర్గనైజింగ్ సెక్రటరీ శరత్ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ కట్టా శ్రీనివాసరావు, అధ్యాపకులు ఉండ్రు కిరణ్ కుమార్, కె.దుర్గాప్రసాద్, భానుప్రసాద్, కె.చంద్ర రావు, లైబ్రేరి యన్ డి.విజయ్ కుమార్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బడ్జెట్ సమావేశం సోమవారం వాయిదా పడింది. ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఏవిధమైన సమీక్షలూ, ఎజెండాలు లేకుండా సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ కడలి పద్మజ్యోతి తెలిపారు. సోమవారం ఉదయం సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షులు అంబటి భవాని, ఉపాధ్యక్షులు శాఖ బాబీ హాజరయ్యారు. ఈ నెలలో బడ్జెట్‌పై సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఎన్నికలు కూడా అమలులో ఉన్నందున వాయిదా వేస్తున్నామని ఎంపిడిఒ తెలిపారు. తదుపరి బడ్జెట్ సమావేశం డిసెంబర్‌లో నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

వ్యాసరచన పోటీలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అయినవిల్లి

షైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలలో ముక్తేశ్వరం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 9వ తరగతి విద్యార్థిని మానేపల్లి సాయి ఆశ్రిత ఇంగ్లీషు మీడియం ప్రథమ స్థానంలో, పదం మంజుశ్రీ తెలుగు మీడియం ప్రథమ స్థానంలో నిలిచారు. సంస్థ కోఆర్డినేటర్ ద్వారా మెమెంటో, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఇద్దరినీ మండల విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరరావు, ఉపాధ్యాయులు వై.ఫణికుమార్, జి.సాయి అభినందించారు.